క్లుప్తంగా

కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి



డిచ్‌పల్లి: బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, వెంటనే వాటిని విడనాడాలని టీయూసీఐ నాయకులు మురళి కిషన్ అన్నారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి, 4 లేబర్ కోడ్ ద్వారా కార్మిక వర్గాన్ని కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా చేసేవిధంగా ప్రయత్నం చేశారన్నారు. గతంలో ఎనిమిది గంటల పనిదినాలు ఉండేవని దానిని తొలగించి 12 గంటల పని దినాలు కొనసాగించే విధంగా ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలు, కార్మిక వర్గం పెద్దఎత్తున పోరాటం చేసి బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. నాయకులు గణేష్, ఇంతియాజ్, శ్రీనివాస్ ఉన్నారు

వ్యవసాయ కార్మికులకు భృతిని ఇవ్వాలి



సిరికొండ: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ కార్మికులకు రూ.12 వేల జీవనభృతిని అమలు చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని గడ్కోల్ గ్రామంలో బుధవారం ఆయన నిరసన కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు.ఈనెల 26న దేశ వ్యాప్త నిరసనలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. రమేష్, దామోదర్, సాయారెడ్డి, కిషోర్, అనీస్, లింబాద్రి, బాల్‌రెడ్డి, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

నిజామాబాద్ సిటీ: అంగన్‌వాడీ టీచర్లకు గత ఐదు నెలలుగా వేతనాలు రావడం లేదని, వెంటనే వాటిని ప్రభుత్వం విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీల జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సెంటర్ల అద్దెలు 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. దేవగంగు, స్వర్ణ, చంద్రకళ, వాణి, యమున, జ్యోతి, సునీతలు పాల్గొన్నారు.

పెన్షన్లు పెంచి ఇవ్వండి



నిజామాబాద్‌అర్బన్: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వికలాంగులకు పెన్షన్లను పెంచి ఇవ్వాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. నగరంలోని ధర్నాచౌక్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలో బుధవారం ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ అవకాశాలలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వీరికి రూ.4000 నుంచి రూ. 6000 పెన్షన్ పెంచి అందివ్వాలన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులలో ప్రాధాన్యత నిస్తూ భర్తీ చేయాలన్నారు. నాయకులు కళ్యాణ్, సాయి, వికలాంగుల సంఘం నాయకులు బీరప్ప కృష్ణవేణి, షేక్ సలీం, సాయిలు, తిరుమల, నాయక్ పాల్గొన్నారు.

మత్తుపదార్థాలతో అనర్థాలు

నిజామాబాద్‌అర్బన్: మత్తుపదార్థాలతో అనేక అనర్థాలు జరిగే అవకాశం ఉందని. వాటికి యువత దూరంగా ఉండాలని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి అన్నారు. నగరంలోని గిరిరాజ్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వాటి వలన కలిగే నష్టాలను వివరించారు. నివారణ మార్గాలను తెలియజేశారు. అలాగే పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు వెంకటరమణ, నాగజ్యోతి, సుధాకర్, నరేష్ కుమార్, దస్తప్ప, రజిత పాల్గొన్నారు.

ఐదు అంశాలను పరిష్కరించాలి

మోర్తాడ్: ప్రజలకు అవసరమైన ఐదు అంశాలు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లును ప్రభుత్వం అందించాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఎంతో మంది పేదలకు ఈ ఐదు అంశాలను ఉచితంగా అందిస్తే వారి జీవితం సుఖంగా సాగుతుందని చెప్పారు. బుధవారం ఐదు అంశాల అమలు కోసం మోర్తాడ్ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. నాయకులు రాజు, రాము, పద్మ, నర్సయ్య తదితరులు ఉన్నారు.

రూ.10 లక్షల నిధులు వృథా..!



కోటగల్లీలో నిర్మించిన మార్కెట్ షెడ్లు

- నగరంలో నిరుపయోగంగా మారిన మార్కెట్ షెడ్లు
- ముందుకురాని వ్యాపారులు
- రోడ్లమీదనే కూరగాయల అమ్మకాలు



నాందేవ్‌వాడలో..



రోడ్డు మీద కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులు

నిజామాబాద్ సిటీ: వీధి వ్యాపారులు రోడ్లమీద వ్యాపారం చేయకుండ వారికోసం నగర మున్సిపల్ ఆధ్వర్యంలో పలుచోట్ల మార్కెట్ షెడ్లు (వీధి విక్రయ కేంద్రాలు) నిర్మించింది. కానీ వ్యాపారులు వాటిపై ఆసక్తి చూపకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో రూ.లక్షల నిధులు వృథా అయ్యాయని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రెండు చోట్ల నిర్మాణం..

కూరగాయల విక్రయదారులు నిజామాబాద్ నగరంలోని పలు చోట్ల రోడ్డుకు ఇరువైపులా, నాలుగు రోడ్ల కూడళ్లలో కూరగాయలు విక్రయిస్తూ పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఈక్రమంలో ట్రాఫిక్ సమస్యలతోపాటు చిన్నపాటి రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. వీటిని అధిగమించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కూరగాయలు విక్రయించేందుకు వీధి విక్రయ కేంద్రాలు నిర్మించారు. వీటిని స్ట్రీట్ వెండింగ్ జోన్స్ అని కూడా పిలుస్తున్నారు. నగరంలో అధిక రద్దీ ఉండే ప్రదేశాల్లో రెండు చోట్ల ను ఎంపిక చేసుకున్నా రు. వాటిలో నాందేవ్‌వాడ చౌరస్తా, కోటగల్లి (ఉషా మయూరి థియేటర్ వెనుక)ల్లో వీధి విక్ర య కేంద్రాలు నిర్మించారు. రూ. 10 లక్షల నిధులతో 25 విక్రయ కేంద్రాలు నిర్మించారు. వీటిని నిర్మించి ఏళ్లు గడుస్తోంది.

రోడ్ల మీదనే విక్రయాలు..

మార్కెట్ షెడ్లను వ్యాపారులకు కేటాయిస్తామంటే ఎవరూ ముందుకు రావడం లేదు. పర్మినెంట్‌గా షెట్టర్లు వేసి ఇవ్వాలని కొందరు పట్టుపడుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు. అయితే కేవలం ఇవి విక్రయ కేంద్రాలు మాత్రమే. ఇక్కడ విక్రయించేవారు ఉదయం నుంచి సాయంత్రం వరకు విక్రయాలు జరిపాలి. అనంతరం తమ సామగ్రి వెంట తీసుకెళ్లాలి. రాత్రి సమయంలో ఈ గదులన్నీ ఖాళీగానే ఉండాలన్నది నిబంధన. అయితే కేవలం విక్రయాలు జరిపేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో వారు రోడ్లపైనే కూరగాయల విక్రయాలు జరుపుతున్నారు. అలాగే పలు కాలనీల్లో తోపుడబండ్లపైన, తాత్కాలిక షెడ్లు వేసుకుని విక్రయిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై వ్యాపారాలు కొనసాగకుండా, మార్కెట్ షెడ్లలో విక్రయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి..



కూరగాయలు అమ్మేందుకు నగరంలో సరైన మార్కెట్‌లు లేవు. రోడ్లమీద అమ్మే కూరగాయలు దుమ్ము, దూళితో ఉంటున్నాయి. అయినా వాటిని కొనకతప్పడం లేదు. కంఠేశ్వర్ సమీపంలో కూడా స్ట్రీట్ వెండింగ్స్ కేంద్రాలు నిర్మించాలి. వీధి విక్రయ కేంద్రాలను అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలి.

–గట్ల ప్రకాష్, కంఠేశ్వర్

ఎవరూ ముందుకు రావడం లేదు..



వీధి విక్రయదారుల కోసం నగర పరిధిలో వెండింగ్ జోన్స్ ఏర్పాటుచేశాం. కానీ ఇక్కడ కూరగాయలు విక్రయించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో అవి వృథాగా ఉన్నాయి. విక్రయాలు జరపాలకున్నవారు మెప్మా అధికారులను సంప్రదించాలి. వ్యాపారులు వీధి విక్రయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

–రమేష్ చిదుర, టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: ఇటీవల బాసర గోదావరి నదిలో తండ్రికూతుళ్లు వేణు, అపర్ణ దూకి ఆత్మహత్య చేసుకున్నారు. బాధిత కుటుంబాన్ని బుధవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పరామర్శించి, అండగా ఉంటామని భరోసానిచ్చారు. నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో నివాసముంటున్న బాధిత కుటుంబానికి ధన్‌పాల్ లక్ష్మీబాయి, విఠల్‌గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.25వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. భవిష్యత్‌లో కూడా అన్ని విధాలా ఆదుకుంటామని హామీనిచ్చారు. వడ్డీ వ్యాపారులు, మైక్రో ఫైనాన్సుల పట్ల కఠినంగా వ్యవహరించాలని పోలీసులను కోరారు. అనంతరం నగరంలోని 17వ డివిజన్ కార్పొరేటర్ మాయావర్ సవిత భర్త రాజు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా.. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే ధన్‌పాల్ పరామర్శించారు. రాజు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. నాయకులు, కార్పొరేటర్లు నాగోళ్ల లక్ష్మీనారాయణ, సుక్క మధు, ప్రభాకర్, మల్లేష్, ఆనంద్, భాస్కర్, కొండా రఘు, ప్రతాప్, శ్రీనివాస్, అర్వపల్లి బాలశేఖర్, గడ్డం రాజు, ఉన్నారు.

ఆ స్థలాన్ని కోర్టు అవసరాలకు కేటాయించాలి




ఎమ్మెల్యే భూపతిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు


ఖలీల్‌వాడి: జిల్లా న్యాయవ్యవస్థ కార్యాలయాల అవసరాల కోసం ఓల్డ్ విద్యాశాఖ ఖాళీ స్థలాన్ని కేటాయించాలని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ కోరారు. ఈమేరకు అసోసియేషన్ సభ్యులు బుధవారం నగరంలోని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

జిల్లా కోర్టు ప్రాంగణంలో కోర్టుల సంఖ్య పెరిగిందని దానికి అనుగుణంగా కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారుల సంఖ్య కూడా అదే స్థాయిలో పెరిగిందని జగన్ వివరించారు. జిల్లాకోర్టుకు ఆవరణకు ఆనుకుని ఉన్న పాత విద్యాశాఖ కార్యాలయ ఖాళీ స్థలం జిల్లా న్యాయవ్యవస్థ అవసరాలకు అనువుగా ఉంటుందన్నారు. సదరు రెండు ఎకరాల స్థలాన్ని న్యాయవ్యవస్థకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే విధంగా సహకరించాలని విన్నవించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధర్పల్లి రాజేశ్వర్‌రెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్‌కుమార్ సుబేధార్, బార్ ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, లైబ్రరీ కార్యదర్శి పిల్లి శ్రీకాంత్, సీనియర్ న్యాయవాదులు సుదర్శన్‌రెడ్డి, ఆశా నారాయణ, ప్రభాకర్‌రెడ్డి, శ్యామ్ బాబు ఉన్నారు.

సరైన సమాచారాన్ని సేకరించాలి



ఆర్మూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు



ఆలూర్‌లో..

ఆర్మూర్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో సిబ్బంది తప్పులు లేకుండా సరైన సమాచారాన్ని మాత్రమే సేకరించాలని ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు సూచించారు. పట్టణంలోని 33, 35వ వార్డుల్లో కొనసాగిని సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎన్యుమరేటర్లకు పలు సూచనలిచ్చారు.

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేను తహసీల్దార్ రమేష్ పరిశీలించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఆలూర్ గ్రామంలో 94 శాతం సర్వే పూర్తయిందన్నారు. రెండు రోజుల్లో వంద శాతం పూర్తవుతుందన్నారు.

డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ



డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

బాల్కొండ: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమగ్ర కుటుంబ సర్వే వివరాల నమోదు కోసం ఆపరేటర్లకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో విజయ్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్వే నమోదు వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. సర్వే నివేదిక అంశాలను తప్పులు దొర్లకుండ నమోదు చేయాలన్నారు. ఎంపీవో గంగామోహన్, ఆపరేటర్లు ఉన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న టీపీవో రమేష్ గుప్తా

నిజామాబాద్ సిటీ: వీధి విక్రయదారులు ప్రభుత్వం అందించే రుణాలు తీసుకుని ఆర్థికంగా ఉన్నత స్థితికి ఎదగాలని మున్సిపల్ టౌన్ ప్రాజెక్టు అధికారి చిదుర రమేష్ గుప్తా అన్నారు. జిల్లాకేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో బుధవారం లోన్‌మేళా నిర్వహించారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. 'స్వానిధి' పథకంలో గుర్తింపుపొందిన వీధి విక్రయదారులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.50వేల రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వడంతోపాటు వ్యాపార నిర్వహణలో ఇబ్బందులు లేకుండా ఐడెంటీకార్డులు ఇచ్చామన్నారు. కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ కూడా ఉంటుందన్నారు. డిజిటల్ లావాదేవీలు చేయడానికి ఆన్‌లైన్ ఖాతా నిర్వహణకు కావలసిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. బ్యాంకు మేనేజర్ అరుణ్ కుమార్, టీఎంసీ శోభా, సీవోలు అశోక్, సంతోష్, శారద, హారికలు పాల్గొన్నారు.

పశువులకు సకాలంలో వైద్యం అందించాలి



పశువులకు అందిస్తున్న చికిత్సలను పర్యవేక్షిస్తున్న జిల్లా పశువైద్యాధికారి జగన్నాథచారి

మాక్లూర్: పశువులకు సకాలంలో వైద్యం అందించాలని, ఎప్పటికప్పుడు పెంపకందారులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి జగన్నాథచారి పశువైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని ముల్లంగి (బి) గ్రామంలో బుధవారం మండల పశువైద్యాధికారి ఉమా సహేర్ ఆధ్వర్యంలో సిబ్బంది పశువులకు గర్భకోశవ్యాధి చికిత్సలను నిర్వహించారు. శిబిరాన్ని జగన్నాథచారి పర్యవేక్షించి, మాట్లాడారు. ఇటీవల కొన్ని పశువులు అకాల మృతి చెంది పశు పెంపకందారులు నష్టపోయారని విచారం వ్యక్తం చేశారు. పశువైద్యులు అన్ని సమయాల్లోను వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వినిత, సుధీర్, అహ్మద్, లక్ష్మి, పుష్ప, శ్యామల, గంగాధర్, పశువు పెంపకందారులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



డీఈవో అశోక్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

నిజామాబాద్ రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. రూరల్ మండలంలోని తిర్మన్‌పల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం ఉమ్మడి జిల్లా నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా ముఖ్యమని అన్నారు. అనంతరం డీఈవోను సన్మానించారు. బాలుర విభాగంలో సుద్దపల్లి జెడ్పీహెచ్ఎస్ మొదటి స్థానంలో నిలవగా, తిర్మన్‌పల్లి(ఎన్) రెండో స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో అభ్యాస స్కూల్ నిలిచినట్లు పాఠశాల హెచ్‌ఎం సీతాదేవి తెలిపారు. అదే విధంగా బాలికల అండర్-17 నెట్‌బాల్ పోటీల్లో మిట్టాపల్లి జెడ్పీహెచ్ఎస్ ప్రథమస్థానంలో నిలవగా, సుద్దపల్లి జెడ్పీహెచ్ఎస్ రెండో స్థానంలో, మూడో స్థానంలో తిర్మన్‌పల్లి-ఎన్ నిలిచింది. కార్యక్రమంలో ఎంఈవో సేవ్లా, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి, ఉపాధ్యాయులు, త్రయంబకేశ్వర్, పీఈడీ వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని మల్లారంలో బుధవారం గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా జరిగాయి. రెండు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా బుధవారం వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య దేవత విగ్రహాలను గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠించారు. ఈసందర్భంగా గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. విగ్రహాల దాత నందిపేటకు చెందిన రమణరెడ్డిని సన్మానించారు. భక్తులకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

నేడు స్వర్ణామృత ప్రాశన పంపిణీ

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని కేదారీశ్వర ఆశ్రమంలో గురువారం చిన్న పిల్లలకు స్వర్ణామృత ప్రాశన పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. కేదారీశ్వర ఆశ్రమం వ్యవస్థాపకుడు మంగిరాములు మహారాజ్ ఆధ్వర్యంలో చేపట్టే ఈ కార్యక్రమంలో 15 సంవత్సరాలలోపు పిల్లలకు చుక్కల మందులు వేయబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా గంగా హారతి



నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని ఉమ్మెడ గోదావరి నది తీరాన కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహారాజ్ ఆధ్వర్యంలో గంగా హారతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి పరివాహక ప్రాంతంలోని ఉమామహేశ్వర ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నది తీరాన శివలింగానికి బ్రాహ్మణోత్తముల మంత్రోచ్ఛారణలతో పూజలు నిర్వహించారు. అనంతరం గోదావరి నదికి హారతి ఇచ్చి, పూజలు చేశారు. మాజీ సర్పంచ్ ఉమ్మెడ పోశెట్టి, బీజేపీ నాయకులు కోటపాటి నరసింహ నాయుడు, భక్తులు పాల్గొన్నారు.



ధాన్యానికి బోనస్ ఇవ్వాలి



రుద్రూర్: సకాలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనందున ప్రయివేట్‌గా విక్రయించిన వరి ధాన్యానికి కూడా రూ.500 బోనస్ ఇవ్వాలని పోతంగల్ రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం వారు పోతంగల్ మండలకేంద్రంలోని తహసీల్ కార్యాలయానికి తరలివెళ్లి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ధాన్యం కోతల తర్వాత ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక చాలామంది రైతులు దళారులను ఆశ్రయించి ప్రయివేటుగా ధాన్యం విక్రయించారు. అదే సమయంలో అకాల వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేశాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ ధరకు విక్రయించాల్సి వచ్చింది. వీటికి బోనస్ ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. బజరంగ్ హన్మాండ్లు, గంధం మోహన్, భీమ్‌రావ్, శంకర్, బీరుగొండ తదితరులు ఉన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్సెడ్	200
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	78,700	వెండి(కిలో)	96,000
22 క్యారెట్స్	72,625		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	40	గాజరుగడ్డ	70	100
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	30	50	దోసకాయ	30	50
దొండకాయ	40	80	ఆలుగడ్డ	35	60
బీర్నీసుకాయ	50	80	గోబిగడ్డ	30	60
కాకరకాయ	40	80	గోబిపువ్వు	50	90
వంకాయ	40	60	బీట్‌రూట్	50	90
పాలకూర	30	50	కరివేపాకు	50	70
మెంతికూర	70	90	చామగడ్డ	40	70
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	80	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	60	90			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	అమరన్(తెలుగు)-10.30 4.25 10.30, లక్కీ భాస్కర్(తెలుగు)-1.30 7.40
స్క్రీన్-3	కంగువ - 10.30 4.30 10.40, అమరన్ (తెలుగు) - 1.30 7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కంగువ 3డీ (తెలుగు)-11.50 3.15 6.40 10.10
స్క్రీన్-2	గ్లాడియేటర్-2 (తెలుగు)-12.10 మట్కా (తెలుగు)-3.35 7.00 క(తెలుగు)-10.25
స్క్రీన్-3	అమరన్(తెలుగు)- 11.45 3.15 6.50 లక్కీ భాస్కర్(తెలుగు)-10.25
స్క్రీన్ -4	క(తెలుగు)-1.00 లక్కీ భాస్కర్ (తెలుగు) - 4.15 గ్లాడియేటర్ (తెలుగు)- 7.30 అమరన్ (తెలుగు)- 10.45
లలితామహల్	దేవర పార్ట్-1 (తెలుగు)
దేవి	మట్కా (తెలుగు)
నటరాజ్	అమరన్ (తెలుగు)
విజయ్	కంగువ 3డీ (తెలుగు)

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ డివిజన్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయమని సబ్‌కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. బోధన్‌లోని లయన్స్ కంటి ఆస్పత్రి భవనం ఆవరణలో బుధవారం సొసైటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సబ్‌కలెక్టర్ హాజరై రెడ్‌క్రాస్ సొసైటీ ఈ ఏడాదిలో నిర్వహించిన కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. 2,569 యూనిట్ల రక్తాన్ని రక్తదాన శిబిరాల ద్వారా సేకరించడం, 1004 మంది తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తాన్ని అందించి, వారికి అవసరమగు మందులను అందించినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. సొసైటీ జిల్లా అధ్యక్షుడు బుస్స అంజనేయులు, ఏసీపీ శ్రీనివాస్, తహసీల్దార్ విఠల్, డివిజన్ అధ్యక్షులు బసవేశ్వర్‌రావ్, జిల్లా కోశాధికారి రవిందర్, రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ సభ్యులు తోట రాజశేఖర్, కోడాలి కిశోర్‌కుమార్, శ్రీనివాస్‌రావ్, జిల్లా ఎగ్జిక్యూటీవ్ సభ్యులు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.